

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం
- ఐదేళ్లుగా గ్రోయిన్లు, కాలువల అభివృద్ధికి చర్యలు శూన్యం
- వర్షాధారంపైనే ఈ ఏడాది వరి సాగు చేయాల్సి వస్తుందని రైతుల ఆవేదన
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

- వార్త 7వ పేజీలో..

వీడని స్మార్ట్ మీటర్ల బెడద

గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మోటార్లకు బిగించాలని నిర్ణయం

- జిల్లాలో 2022 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం
- వ్యతిరేకించిన రైతులు, రైతు సంఘాలు
- ఎన్నికల ముందు ఓట్ల కోసం పనులు నిలుపుదల.. ఇప్పుడు మళ్లీ మొదలు
- ప్రభుత్వం మారినా వెనక్కి తగ్గని కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు ఇస్తే ఆ ప్రకారం చర్యలు తీసుకుంటామంటున్న ఈపీడీసీఎల్ అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యవసాయ బోర్ల మోటార్లకు స్మార్ట్ మీటర్ల అమరిక పనులు కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ పొందిన రాయలసీమకు చెందిన కాంట్రాక్టర్ ప్రభుత్వం మారినా వెనక్కి తగ్గడం లేదు. రైతులు వ్యతిరేకిస్తున్నా పనులు కానిచ్చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేస్తే గానీ దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

జిల్లాలోని 24 మండలాల్లో 37,480 వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించి 2022 ఫిబ్రవరిలో జిల్లాలో పనులు ప్రారంభించింది. ఈ కాంట్రాక్ట్ పొందిన రాయలసీమకు చెందిన కాంట్రాక్టర్



మునగపాక మండలం గణపర్తిలో మీటర్లు బిగిస్తున్న సిబ్బందిని అడ్డుకుంటున్న రైతులు

ఇప్పటికే 19 వేలకు పైగా మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించారు. అనకాపల్లి, మునగపాక, కశింకోట, కె.కోటపాడు, చోడవరం, దేవరాపల్లి, గొలుగొండ, నాతవరం రోలుగుంట మండలాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక పనులు జరుగుతున్నాయి. స్మార్ట్ మీటర్లు అమర్చిన రైతుల ఆధార్, ఫోన్, బ్యాంకు ఖాతాల నంబర్లు ఈపీడీసీఎల్ అధికారులు సేకరిస్తున్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు త్వరలో వినియోగించిన రీడింగ్ చార్జీల మొత్తాలు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆ మొత్తాన్ని మళ్లీ ప్రభుత్వానికి రైతులు చెల్లించాల్సి ఉంటుందని అంటున్నారు.

ఎన్నికల ముందు నిలిపివేసి.. మళ్లీ ఇప్పుడు పనులు

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న తొలినాళ్లలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రైతు సంఘాలు కూడా ఆందోళనలు చేశాయి. అయినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే ఎన్నికల ముందు ఓట్ల కోసం ఈ పనులు నిలిపివేసింది. కాగా ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం రావడంతో స్మార్ట్ మీటర్ల బెడద ఉండదని రైతులు భావించారు. అయితే కూటమి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయకపోవడంతో గత వారం రోజులుగా మళ్లీ జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

స్మార్ట్ మీటర్లు బిగించే పనులు ఆపేయాలి



జిల్లాలో గత ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ఈ పనులు తక్షణమే నిలిపివేయాలి. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. రైతులకు కూటమి ప్రభుత్వం 9 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చింది. మాట ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించకుండా నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించి ఆదుకోవాలి. రైతుల మోటార్లకు మీటర్లు అమర్చడంతో విద్యుత్ బిల్లుల భారం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల అమరిక పనులు నిలిపి వేసేలా నిర్ణయం తీసుకోవాలి.

- అప్పలరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అనకాపల్లి

విస్తారంగా వాన

పలు మండలాల్లో భారీ వర్షం, కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు



వడ్డాదిలో వర్షం

అన్నదాతల్లో ఆనందం

అనకాపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల సోమవారం వర్షం కురిసింది. రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో జిల్లాలో పలు మండలాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుచ్చెయ్యపేట మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చోడవరంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతం కాగా, సాయంత్రం వర్షం పడింది. చీడికాడ మండలంలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతం కాగా, సాయంత్రం నాలుగు గంటల నుంచి గంటసేపు వర్షం పడింది. అనకాపల్లి, మునగపాక, రావికమతం, సబ్బవరం, కోటవురట్ల, పరవాడ, గొలుగొండ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, ఎలమంచిలి, కశింకోట మండలాల్లో వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లులు పడ్డాయి. గత వారం రోజులుగా వ్యవసాయ పనులు చేపట్టేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద స్థాయికి కల్యాణపులోవ నీటిమట్టం

- 460 అడుగుల సామర్థ్యం కాగా 459 అడుగులకు చేరిన నీరు
- రెండు గేట్లు ఎత్తివేత.. 120 క్యూసెక్కులు విడుదల
- మూడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారుల హెచ్చరిక



కల్యాణపులోవ రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి నీరును విడుదల చేసిన దృశ్యం

రావికమతం, జూలై 15: మండలంలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయి చేరుకోవడంతో సోమవారం సాయంత్రం రెండు గేట్లు ద్వారా 120 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్టు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం సామర్థ్యం 460 అడుగులు కాగా, సోమవారం నాటికి 459 అడుగులకు చేరిందన్నారు. రిజర్వాయర్ ఎగువన కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కుల నీరు చేరుతున్నదన్నారు. దిగువన సర్పానదికి ఆనుకొని ఉన్న మూడు మండలాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. సర్పానదిలో ప్రవాహం ఉధృతి పెరుగుతోందని, నది దాటి వెళ్లడం ప్రమాదమన్నారు. సాధారణంగా అక్టోబరు, నవంబరు నెలల్లో వర్షాలు విస్తారంగా ... మిగతా 8వ పేజీలో

కృష్ణావతారంలో జగన్నాథుడు



జగన్నాథుని రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాల్లో భాగంగా సోమవారం జగన్నాథ స్వామి శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- చోడవరం

శరవేగంగా అన్న క్యాంటీన్లు ముస్తాబు

- జీవీఎంసీ ఈఈ చిరంజీవి పనుల పరిశీలన

అనకాపల్లి టౌన్, జూలై 15 : అనకాపల్లిలో అన్న క్యాంటీన్ల భవనాలు శరవేగంగా ముస్తాబవుతున్నాయి. పట్టణంలో ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద, రైల్వేస్టేషన్ ప్రధాన కూడలి వద్ద గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు రూ.5లకే భోజనం అందించిన విషయం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు రద్దు చేయడంతో పేదలకు భోజనం కరువైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడమే కాకుండా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ల భవనాలను సర్వాంగసుందరంగా జీవీఎంసీ అధికారులు తీర్చిదిద్దుతున్నారు. రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ ఆధునికీకరణకు రూ.17 లక్షలు, ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద గల అన్న క్యాంటీన్‌కు రూ.18 లక్షలతో పనులను వేగవంతం చేశారు. రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ భవన ఆధునికీకరణ పనులను జీవీఎంసీ ఈఈ చిరంజీవి సోమవారం పరిశీలించారు. ఆగస్టు రెండో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. దీంతో జీవీఎంసీ ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ పనులను పరిశీలించిన జీవీఎంసీ ఈఈ చిరంజీవి



నర్సీపట్నంలో అన్న క్యాంటీన్ భవనం వద్ద అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆగస్టు మొదటి వారంలో నర్సీపట్నంలో ప్రారంభం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 15 : స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా అన్న క్యాంటీన్‌ను ఆగస్టు మొదటి వారంలో ప్రారంభిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. మరమ్మతులు చేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆర్డీవో జయరాం, మునిసిపల్ డీఈఈ నారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆ తేదీన తాను అసెంబ్లీలో జెండా వందనం కార్యక్రమంలో పాల్గొనవలసి ఉన్నందున నర్సీపట్నంలోని అన్న క్యాంటీన్ ఆగస్టు మొదటి వారంలో మంచి రోజు చూసుకొని ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో విశాఖపట్నం అక్షయపాత్ర సంస్థ భోజనాలు వండి అన్న క్యాంటీన్‌కి పంపించేవారని తెలిపారు. ఇప్పుడు కూడా ఆ సంస్థతో మాట్లాడుతున్నామని, లేనిపక్షంలో ఇక్కడే వంటలు తయారు చేయించి అన్న క్యాంటీన్ నడుపుతామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు రూ.5 లకు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు రాష్ట్ర వ్యాప్తంగా పెట్టినట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కక్ష కట్టి అన్న క్యాంటీన్లు మూసేసిందని తెలిపారు. అయినా సరే గత సంవత్సరం నుంచి అన్న క్యాంటీన్ నడుపుతున్నానని చెప్పారు.

1912కు ఫోన్ చేస్తే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూలై 15: వ్యవసాయానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కావలసిన వారు టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి సర్వీస్ పొందవచ్చునని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం 1912కు ఫోన్ చేసి కనెక్షన్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని మీసేవా కేంద్రాల, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల అప్లికేషన్‌లు అప్‌లోడు చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయడం ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందే నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. 1912 నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఫోన్ చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబరు, రిజిస్టర్డ్ మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్ నంబరు, సర్వే నంబరు, వాల్టా సర్టిఫికెట్ నంబరు, కుల ధ్రువీకరణ పత్రం నంబరు తదితర వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- వార్త 7వ పేజీలో..

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

- రోజుకు కనీసం 10 వేల మందికి ఓపీ సేవలు అందాలి: ఎంపీ ఎం.శ్రీభరత్
- ఆస్పత్రి అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన
- కేజీహెచ్‌కు రావాలంటే రోగులు భయపడుతుంటారు: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేయాలి
- వైద్యులు వ్యాపారాత్మక ఆలోచన వీడి సేవాభావంతో పని చేయాలని సూచించిన ఎమ్మెల్యే పల్లా
- ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చిన వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల పట్ల జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలోని సెమినార్ హాలులో వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులతో ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడిన పలువురు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి పనితీరు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కేజీహెచ్‌లో ప్రతిరోజూ కనీసం పది వేల మందికిపైగా ఓపీ (అవుట్ పేషెంట్లు) సేవలు పొందాలని, కొన్నాళ్ల కిందటే ఏర్పాటుచేసిన గీతంలో ఐదు వేల మందికిపైగా ఓపీ సేవలు పొందుతున్నారన్నారు. ఐదు, పదేళ్ల ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేయవద్దని, రానున్న 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని రూ.200-300 కోట్లతో భారీగా భవన నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. నిధులు గురించి ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, తదితరులు

క్రైం... crime news

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

కశింకోట, జూలై 15 : మండలంలోని నర్సింగ బిల్లి - బయ్యవరం రైల్వేస్టేషన్ల మధ్యలో ఓ రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడని తుని రైల్వే పోలీసుస్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడు అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడి గ్రామానికి చెందిన అరేపు సోమేశ్వరరావు (25)గా గుర్తించామన్నారు. కాగా మృతుడు రాజమండ్రి నుంచి ఆదివారం రాత్రి అనకాపల్లికి రైలులో ప్రయాణం చేస్తూ జారిపడి మృతి చెందినట్టు తెలిసిందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక ఒకరి ఆత్మహత్యాయత్నం

అనకాపల్లి టౌన్, జూలై 15 : కడుపునొప్పి తాళ లేక ఓ వ్యక్తి కత్తితో గొంతు, చేతిని కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున కోట్నివీధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోట్నివీధికి చెందిన కె.శ్రీధర్ అనే వ్యక్తి కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నట్టు తెలిసింది. ఆ బాధను తట్టుకోలేక సోమవారం తెల్లవారుజామున కత్తితో గొంతును, ఎడమ చేతి మీద కోసుకుని కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, కేజీహెచ్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, జూలై 15: మండలంలోని నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్‌లో సోమవారం రైలు పట్టాలు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ వివరాలు అందజేస్తూ సోమవారం నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్‌లో ఒకటవ నంబరు ప్లాట్‌ఫారం దాటుతున్న సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో శరీరం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని, మృతుడి ఎడమకాలికి స్టీల్ రాడ్ వేసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రతించాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా : అంగన్‌వాడీ కార్యకర్త మృతి



కళావతి(ఫైల్)

హుకుంపేట, జూలై 15: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త కళావతి మృతి చెందిన ఘటన మండలంలో పాడేరు- అరకులోయ జాతీయ రహదారిపై గడుగుపల్లికి సమీపంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో జాంకరంవలస గ్రామానికి చెందిన బి. మోహనరావు మరొకరి ఆటోను అద్దెకు తీసుకుని భార్య, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, చిన్న కుమార్తె, మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి పాడేరుకు బయలుదేరారు. పాడేరు-అరకులోయ జాతీయ రహదారిలో గడుగుపల్లి వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అంగన్‌వాడీ కార్యకర్త కళావతి(35) తలకు బలమైన గాయమైంది. ఆమెను అంబులెన్సులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా.. కళావతిని పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మృతికి మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, వైస్ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సీఐటీయూ మండల కార్యదర్శి అప్పలకొండపడాల్, తదితరులు సంతాపం తెలిపారు.

గాజువాకలో హత్య

- హతుడు మాజీ సైనికుడు
- నిందితులు లొంగుబాటు
- స్థల వివాదమే కారణం



హత్యకు గురైన అప్పలనాయుడు

గాజువాక, జూలై 15: గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి మాజీ సైనికుడు హత్యకు గురయ్యారు. స్థల వివాదమే ఇందుకు కారణంగా పోలీసులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పాత కర్ణవాని పాలేనికి చెందిన మాజీ సైనికుడు వేమిరెడ్డి అప్పలనాయుడు (48)ను అదే ప్రాంతవాసులు బంకా రాము, బంకా అశోక్‌లు కొబ్బరి బొండాల కత్తితో జగ్గు జంక్షన్ సమీపంలో గల శ్రీకృష్ణనగర్ రోడ్డులో అతి కిరాతకంగా నరికి చంపారు. అనంతరం నిందితులు గాజువాక పోలీసులకు లొంగిపోయారు. ఆర్మీలో పదవీ విరమణ అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అప్పలనాయుడుకు, రాము, అశోక్‌ల మధ్య చినగంట్యాడ ప్రాంతంలో ఉన్న 148 గజాల స్థలంపై కొద్దిరోజులుగా వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో రాము, అశోక్‌లు కలిసి అప్పలనాయుడును హతమార్చారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ మోకా సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. స్థల వివాదమే హత్యకు కారణమని డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై గతంలో స్టేషన్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- రంపచోడవరంలో మీకోసం నిర్వహణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టరు దినేశ్‌కుమార్ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. మీ కోసం కార్యక్రమానికి కొత్త కలెక్టర్ రావడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో సమస్యలను చెప్పుకునేందుకు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ జాన్‌రాజ్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డ్వామా పీడీ ఎం.శివయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



పింఛన్ ఇప్పించాలంటూ కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగురాలు

తుమ్మపాల, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందుతున్న అర్జీల పరిష్కార విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం శంకరం వద్ద గల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. సుమారు 247 అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళనలు

నక్కపల్లి మండలం డి.లక్ష్మీపురం గ్రామంలో పేదల సాగు భూములను వైజాగ్, చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో సర్వే నంబరు 85లో 110 ఎకరాలు దాదాపు 150 మంది పేదల నుంచి సేకరిస్తున్నారని, ఈ భూములకు నష్టపరిహారాన్ని చెల్లించాలని గ్రామస్థులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అలాగే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మత్తు వ్యసన విముక్తి కేంద్రం ఉద్యోగుల జీత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం గ్రామాల్లో గత ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలి

గత ఐదేళ్లుగా వృద్ధాప్య పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని నక్కపల్లిలో నివాసముంటున్న దివ్యాంగురాలు ఎద్దు అప్పలనర్స ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో ఆటోలో కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దని ధర్నా



ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 15 : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలంటూ సోమవారం ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట రైతు సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ మునగపాక మండలంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లు అత్యంత వేగంగా అమర్చుతున్నారన్నారు. మీటర్లు బిగించినప్పుడు రైతుల ఆమోదం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఈపీడీసీఎల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల నాయకులు గండి నాయనబాబు, రామ సదాశివరావు, బుద్ధ రంగారావు, సీఐటీయూ నాయకులు బ్రహ్మజీ, బుజ్జి, తిమ్మరాజుపేట ఉపసర్పంచ్ భీశెట్టి రాము ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జనసేన ఎమ్మెల్యేలకు సత్కారం

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేశ్‌బాబులను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సత్కరించారు.

ఆలిండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా కేఎస్‌వీ



అభినందనలు అందుకుంటున్న కేఎస్‌వీ

అనకాపల్లి టౌన్, జూలై 15 : ఆలిండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లికి చెందిన కేఎస్‌వీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ టెన్నికాయిట్ కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగింది. 2024-28 వరకు నాలుగేళ్ల పాటు సత్యనారాయణ ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన నియామకం పట్ల టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, చైర్మన్ పీజీవీఆర్ నాయుడు, తవిటయ్య అభినందనలు తెలిపారు.

చేయి చేయి కలిపారు.. అక్విడెక్టు మరమ్మతు చేశారు

- మర్రివాడ చెక్‌డ్యామ్ రైతుల శ్రమదానం.. ▸ 15 ఆయిల్ డ్రమ్‌లతో ఏర్పాటు.. ▸ ఖరీఫ్‌కు సాగునీటి కొరత ఉండదని రైతుల ఆనందం



మర్రివాడ చెక్‌డ్యామ్ అక్విడెక్టుకు డ్రమ్‌లతో తయారు చేసిన కాలువను తీసుకువెళుతున్న రైతులు



ఏడాది క్రితం భారీ వర్షాలకు పిల్లర్ కూలిన దృశ్యం(ఫైల్‌ఫొటో)

కొయ్యూరు, జూలై 15: మండలంలో మర్రివాడ గైరమ్మ చెక్‌డ్యామ్ ప్రధాన అక్విడెక్టు కూలిపోవడంతో చెక్‌డ్యామ్ ఆయకట్టు రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని సాగునీటిని పునరుద్ధరించుకున్నారు. 2023 జూలై 27న కురిసిన భారీ వర్షాలకు ఈ చెక్‌డ్యామ్ అక్విడెక్టు కూలిపోయింది. దీంతో గత ఏడాది ఖరీఫ్ ప్రశ్నార్థకంగా మారింది. బూదరాళ్ల కొండలపై నుంచి వచ్చే కొంగవాగు నీరు మర్రివాడ సమీపంలో గైరమ్మ చెక్‌డ్యామ్‌కు చేరుతుంది. ఇక్కడి నుంచి మర్రివాడకు చెందిన భూములతో పాటు దొడ్డవరం, చీడిపాలెం, కొయ్యూరు గ్రామాలకు చెందిన 1500 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ చెక్‌డ్యామ్ ద్వారా అందుతున్న నీటితో రైతులు ప్రతి ఏడాది రెండు పంటలు పండిస్తున్నారు. అయితే ఈ చెక్‌డ్యామ్ నుంచి సాగునీరు అందించే ప్రధాన కాలువకు మర్రివాడ నుంచి దొడ్డవరం గ్రామాల మధ్యలో నాలుగు ప్రాంతాలలో సిమెంట్ పిల్లర్లు వేసి అక్విడెక్టులను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధాన చెక్‌డ్యామ్‌కు అర కిలోమీటరు దూరంలో పొత్తూరు, తాళ్ల వారి పొలాలకు సమీపంలో ఏర్పాటు చేసిన అక్విడెక్టు పిల్లరు రెండేళ్ల క్రితం కుంగిపోగా రైతులు బలమైన కర్రలను దన్ను పెట్టారు. ఈ విషయాన్ని అప్పట్లో ఉన్నతాధికారులు, పాలకులకు రైతులు విన్నవించారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ఏడాది జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు అక్విడెక్టు కూలిపోవడంతో చెక్‌డ్యామ్ ద్వారా సాగు భూములకు నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గత ఖరీఫ్‌లో సాగు ప్రశ్నార్థకమైంది. దీంతో రైతులు అక్విడెక్టును పునరుద్ధరించేందుకు చేయి చేయి కలిపారు. సోమవారం 15 ఆయిల్‌డ్రమ్‌లను ఒకదానికి ఒకటి వెల్డింగ్ చేయించి, గ్రామస్థులు అతి కష్టం మీద మోసుకెళ్లి అక్విడెక్టు వద్ద అమర్చారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా ఉండదని రైతులు అంటున్నారు. అక్విడెక్టు పునః నిర్మాణానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఎంఐ జేఈ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా రైతుల వినతి మేర గత ఏడాదే పిల్లరు నిర్మాణాలకు రూ.6 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. అనుమతులు వచ్చాయని, నిధులు విడుదల కాలేదన్నారు. అందువల్ల పనులు చేయలేకపోయామన్నారు.

సాగునీటి వనరులపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- గ్రోయిన్లు, కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోని వైనం
- ఖరీఫ్ వచ్చినా మారని పరిస్థితి
- వర్షాధారంపైనే ఈ ఏడాది వరి సాగు చేయాల్సి వస్తుందని రైతుల ఆవేదన
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు



తూటిపాలలో నిరుపయోగంగా ఉన్న గ్రోయిన్

మాకవరపాలెం, జూలై 15: మండలంలో గత వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లు సాగునీటి వనరులు అధ్వానంగా తయారయ్యాయి. సాగునీటి కాలువలు, గ్రోయిన్లు మరమ్మతులు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ ఏడాది కూడా వర్షాధారం మీదే వరి సాగు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. మండలంలో తూటిపాల గ్రామంలో గుడబాల గెడ్డలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. పది లక్షలతో గ్రోయిన్ ఏర్పాటు చేసి, సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించింది. అయితే తర్వాత వచ్చిన తుపాన్ల వర్షాలకు గ్రోయిన్ పూర్తిగా దెబ్బతింది. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత రైతులు పలు మార్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యేకి, అనకాపల్లి మాజీ ఎంపీకి వినతులు ఇచ్చారు. అయినా ఈ గ్రోయిన్ పరిస్థితి మాత్రం మారలేదు. దీంతో ఈ ఏడాది వరి సాగు చేయాలా? వద్దా? అనే మీమాంసలో రైతులు ఉన్నారు. ఇప్పటికే చాలామంది రైతులు 100 ఎకరాల్లో సరుగుడు తోటలు వేశారు. కూటమి ప్రభుత్వం ఈ గ్రోయిన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే మాకవరపాలెంలో సర్పానదికి ఆనుకొని ఉన్న మెరక కాలువ పూర్తిగా మట్టితో కప్పబడింది. ఈ కాలువ ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందేది. అయితే ఐదేళ్లుగా ఈ సాగునీటి కాలువను పట్టించుకోకపోవడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

బలిఘట్టంలో రాయవలస సినిమా షూటింగ్



హీరో,హీరోయిన్‌లపై క్లాప్ కొడుతున్న సూర్య బంగార్రాజు

నర్సీపట్నం, జూలై 15 : బలిఘట్టంలో రాయవలస కొత్త సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న లక్ష్మీదేవి గుడిలో చిత్ర యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయల్ రిసార్ట్స్ యజమాని గణపతిరాజు సూర్య బంగార్రాజు క్లాప్ కొట్టగా.. దర్శకురాలు రాధికా జయంతి హీరో హీరోయిన్‌లపై తొలి సన్నివేశాన్ని చిత్రకరించారు. రేసన్ ప్రొడక్షన్స్ బేనర్‌పై గోపికృష్ణ నిర్మాణ సారథ్యంలో కార్తీక్, శిరీషా హీరో హీరోయిన్‌లుగా గ్రామీణ నేపథ్యంలో రాయవలస సినిమా రూపొందిస్తున్నారు. అల్లు రామకృష్ణ(రాకీ) సినిమాకి కథ, మాటలు అందించారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో 35 రోజులు పాటు సినిమా షూటింగ్ నిర్వహిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్



ఫిర్యాదీతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్

తుమ్మపాల, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతీ ఫిర్యాదును చట్టపరిధిలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామని అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఫిర్యాదీలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన భర్త గోవింద్ కుమార్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని వాడచీపురపల్లికి చెందిన వడ్డాది సుజి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా అంశాలకు సంబంధించి 39 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కి ఫిర్యాదు

అచ్యుతాపురం, జూలై 15: గత ప్రభుత్వంలో నిబంధనలను తుంగలో తొక్కిన అప్పటి అచ్యుతాపురం తహసీల్దార్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని పెదపాడు సర్పంచ్ జనపరెడ్డి అరుణ భర్త రమేశ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

జాతీయ తైక్వాండో టోర్నీలో కుందనశ్రీ ప్రతిభ



బంగారు పతకం సాధించిన కుందనశ్రీ

ఎలమంచిలి, జూలై 15: హైదరాబాద్‌లో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి సెయింట్ జూడ్స్ స్కూల్‌కు చెందిన ఎం.కుందనశ్రీ బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ రిక్కీరీడ్ తెలిపారు. ఆ విద్యార్థినిని, కోచ్ నగిరెడ్డి సత్యనారాయణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బుద్ధుని అవతారంలో జగన్నాథుడు



బుద్ధుని అవతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 15: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి సోమవారం భక్తులకు బుద్ధుని అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



కశింకోట, జూలై 15 : స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో కొలువుదీరిన జగన్నాథస్వామి సోమవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని జగన్నాథస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ఆలయ అర్చకులు, వ్యవస్థాపకులు రేజేటి రామాచార్యులు (రాంబాబు), మారుతి విద్యాపీఠం వ్యవస్థాపకులు మారుతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాణిజ్య భవన సముదాయంపై వివాదం

అనకాపల్లి టౌన్, జూలై 15: అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం మిర్యాల కాలనీలో మునిసిపాలిటీ స్థలంలో నిర్మిస్తున్న వాణిజ్య భవన నిర్మాణ వివాదం హైకోర్టుకు చేరుకుంది. హైకోర్టులో మే నెల 8వ తేదీన దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, జస్టిస్ రఘునందన్‌రావుల డివిజన్ బెంచ్ ఈ నెల 10వ తేదీన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల్లో 6వ పార్టీగా ఉన్న వైసీపీ యువజన విభాగం నాయకుడు పలకా రవిని ఆదేశిస్తూ ఈ ఆస్తిపై మూడవ పార్టీలకు ఎలాంటి ఆసక్తులు కల్పించరాదని ఆదేశాలిచ్చింది.

నూకాంబిక ఆలయంలో
కొబ్బరి నీళ్లు విక్రయం

▸ సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్
▸ అమ్మకాలు జరిపిన సిబ్బందిని అక్కడి నుంచి తొలగించాం : ఈవో

కొత్తూరు, జూలై 15 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొబ్బరి నీళ్లను ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్టి ఆదివారం అమ్మకాలు చేపట్టారని సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్ చేస్తోంది. లీటరు కొబ్బరినీళ్లు రూ.50కి విక్రయించారని ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని ఇతర ప్రాంతం నుంచి వచ్చిన ఓ భక్తుడు సదరు సిబ్బంది ప్రశ్నించగా, దేవస్థానం అధికారులే అమ్మకాలు చేస్తున్నారని చెప్పడంతో ఆ వీడియోను ఆ భక్తుడు సోషల్ మీడియాల్లో, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేసినట్టు చెప్పుకుంటున్నారు. దీనిపై ఆలయ ఈవో బండారు ప్రసాదరావును వివరణ కోరగా, తాము కొబ్బరి నీళ్లను అమ్మకాలు చేయాలని చెప్పలేదని సమాధానం ఇచ్చారు. ఆ వీడియో తన దృష్టికి కూడా వచ్చిందని తెలిపారు. ఆలయంలో కొబ్బరి నీళ్లను అమ్మకాలు జరిపిన సిబ్బందిని అక్కడి నుంచి తొలగించామని బదులిచ్చారు.


నూకాంబిక ఆలయంలో కొబ్బరి నీళ్లను ప్లాస్టిక్ బాటిళ్లలో ఉంచిన దృశ్యం

'చక్కని బోధనతో సత్ఫలితాలు'

కోటవురట్ల, జూలై 15 : విద్యార్థినులకు ఉపాధ్యాయులు చక్కగా బోధన సాగిస్తే వారు సత్ఫలితాలు సాధిస్తారని స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. అనకాపల్లి జీసీడీవో పద్మావతితో కలిసి సోమవారం మధ్యాహ్నం ఆయన ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ప్రశ్నలు వేస్తున్న డీడీ రమణ

వీడని స్మార్ట్ మీటర్ల బెడద

... 5వ పేజీ తరువాయి

పలు చోట్ల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. దీనిని రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల అమరిక పనులు జరుగుతుండడంపై ఏపీ ఈపీడీసీఎల్ జిల్లా అధికారి రాజశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా గతంలో కుదిరిన కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి స్మార్ట్ మీటర్ల పనులపై కొత్త మార్గదర్శకాలు వస్తే ఆ విధానాన్నే అమలు చేస్తామన్నారు. కొన్నిచోట్ల రైతులు వ్యతిరేకిస్తున్న మాట వాస్తవమేనని చెప్పారు. రైతులు వద్దని చెబితే మీటర్లు బిగించవద్దని కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తామన్నారు. కొత్త ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాల ప్రకారం రైతులకు న్యాయం చేస్తామన్నారు.

ప్రమాద స్థాయికి కల్యాణపులోవ నీటిమట్టం

... 5వ పేజీ తరువాయి

కురుస్తాయని, ఈ ఏడాది రిజర్వాయర్ ఎగువ కొండల్లో ముందుగానే వర్షాలు కురుస్తున్నందున జలాశయంలోకి ఇన్‌ఫ్లో అధికంగా వచ్చి చేరుతుండడంతో ప్రమాద స్థాయికి చేరుకుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆయకట్టు రైతులకు నీటికి డోకా ఉండదని ఏఈ సత్యనారాయణదొర తెలిపారు.

గరిష్ఠ సాయికి పెద్దేరు..

మాడుగుల రూరల్: మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలకు జలాశయంలో వర్షం నీరు చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొంతమేర పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 188 క్యూసెక్కులు నమోదైంది. రాత్రి తొమ్మిది గంటల తరువాత స్పిల్‌వే ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని జలాశయం ఏఈ సుధాకర్ తెలిపారు.

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

బెంగ వద్దని, అందుకు అనుగుణమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీహెచ్ పట్ల ప్రజల్లో మంచి భావన ఉండేదని, అది క్రమంగా తగ్గుతోందని, దాన్ని మళ్లీ పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయని, మంచి నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఆస్పత్రి అవసరాలను చెప్పాలని, వాటిని తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పరిశోధనలు సాగించడం ద్వారా ప్రివెంటివ్ మెథడ్స్‌పై దృష్టిసారించాలని శ్రీభరత్ సూచించారు. కేజీహెచ్‌తో పాటు జిల్లా అంతటా ఫాగింగ్ చేయించడంపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, వందలాది మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నిరుపేద రోగులకు ఏర్పడుతోందన్నారు. కేజీహెచ్‌కు రావాలంటే ఇప్పటికీ రోగులు భయపడుతుంటారని, మెరుగైన సేవలు అందవన్న భయం రోగుల్లో ఉందన్నారు. నర్సింగ్ స్టాఫ్ కొరత ఎప్పటి నుంచో వేధిస్తోందని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి అవసరాలకు తగ్గ సిబ్బంది లేరన్నారు. ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలని, అవి తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు సహకారాన్ని అందించేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేయాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. రోగుల పట్లతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఇక్కడకు వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన ప్రజల్లో కలగాలన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీహెచ్‌లో సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషిచేయాలని సూచించారు. వైద్య వృత్తిలో డబ్బు సంపాదించాలన్న ఆలోచన సరికాదని, వ్యాపారులు మాత్రమే డబ్బు సంపాదిస్తారని, ఇందులో సేవాగుణం మాత్రమే ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం: మంత్రి సత్యకుమార్

వందేళ్ల చరిత్ర కలిగిన ఏఎంసీ నుంచి వేలాది మంది వైద్యులుగా బయటకు వెళ్లి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని వారంతా ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందించాలని మంత్రి సత్యకుమార్ కోరారు. దాతల సహకారంతో విభాగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూసే రోజులు పోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు వైపు వచ్చేలా చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలపై దృష్టిసారించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఆస్పత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు మ్యాచింగ్ గ్రాంటుకు నిధులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సత్కరించారు. పలువురు సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ నాయకులు పీలా గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ లోకనాథం, డాక్టర్ గోపి, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

▸ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 15 : సమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం తన కార్యాలయంలో పలువురి నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. భవనాల పన్నులు తగ్గించాలని, ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయాలని, 84వ వార్డులో రోడ్డు నిర్మాణం చేయాలని, ఎన్టీఆర్ స్టేడియం వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న బేకరీ ఉత్పత్తుల కారణంగా స్టేడియంలోకి వస్తున్న పొగను నియంత్రించాలని, లక్ష్మీదేవిపేట కృష్ణ మందిరం వద్ద జీవీఎంసీ స్థలాల ఆక్రమణలను తొలగించాలని, పట్టణంలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేశారు. మరిన్ని సమస్యలను మరికొందరు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రతి ఒక్కరి నుంచి సమస్యలు తెలుసుకున్న అనంతరం జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు

ఫార్మాసిటీలో ఉపాధి కల్పించాలని మత్స్యకారుల వినతి

పరవాడ : ఫార్మాసిటీలో తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని ముత్యాలమ్మపాలెం గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి వినతిపత్రం అందజేశారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని 2012లో రాంకీ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పాటు ఆమరణ నిరాహారదీక్ష కూడా చేపట్టామన్నారు. దీనిపై అప్పట్లో దిగొచ్చిన రాంకీ యాజమాన్యం ఉపాధి కల్పించేందుకు అంగీకరించిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. 12 ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఉపాధి కల్పించలేదని, ఇదే విషయమై హైకోర్టును కూడా ఆశ్రయించడం కూడా జరిగిందని వివరించారు. పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, అర్జిల్లి సోంబాబు, చింతకాయల రమణమూర్తి, చింతకాయల ముత్యాలయ్య, బొంది రంగారావు, కొవిరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన

నక్కపల్లి: మండలంలోని డీఎల్‌పురంలో తాము సాగు చేసుకుంటున్న 110 ఎకరాల భూములను విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరిస్తున్నారని, గత కొన్ని సంవత్సరాల నుంచి సాగులో ఉంటున్న తమకు నష్టపరిహారం అందజేయాలని సాగుదారులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, గింజాల వెంకట రమణ నేతృత్వంలో అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సుమారు 150 మంది పేదలు సాగులో ఉన్న ఆ భూములను కారిడార్ కోసం సేకరించినప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేపల పరదేశి, వాసుపల్లి బాబ్జీ, కిల్లాడ వరహాలు, ఏడిద చిలకమ్మ, గింజాల సింహాద్రి, జగమణి, చేపలరాజు, గరికిన అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

'పరిశ్రమలు విద్యుత్ పొదుపు పాటించాలి'


ఏపీఐఐసీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

అచ్యుతాపురం, జూలై 15 : విద్యుత్‌ను ఆదా చేసి పరిశ్రమలు ఆదాయాన్ని పెంచుకోవాలని ఏపీఎస్ఈసీఎం సంయుక్త కార్యదర్శి ఎ.రామా రావు అన్నారు. అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయంలో సోమవారం ఇంధన పొదుపుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంధన పొదుపును పాటించడం వల్ల పర్యావరణంతో కర్మాగారాలకు కూడా మేలు జరుగుతుందన్నారు. కర్మాగారాలకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఏపీఎస్ఈసీఎం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటికే అచ్యుతాపురం సెజ్‌లో మూడు కర్మాగారాలకు ఆధునిక సాంకేతిక సహాయాన్ని అందించామన్నారు. దీని ద్వారా ఏడాదికి రూ. 660 లక్షలు విద్యుత్ బిల్లులు ఆదాచేయడంతో పాటు కాలుష్య నివారణ కూడా చేయగలిగామని ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కర్మాగారాల ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెజ్‌లో గల అరవై కర్మాగారాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

ఎలమంచిలి, జూలై 15 : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో న్యాయవాదులు, పోలీసులు విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. కోర్టు సముదాయం నుంచి ప్రధాన రోడ్డు మీదుగా హెల్మెట్ వినియోగంపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా ముందుకు సాగారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దూళి నూకరాజు, ఉపాధ్యక్షుడు పి.వి.రమణ, న్యాయవాదులు డి.ఎన్.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాస్, ఎస్ఐ పాపినాయుడుతో పాటు కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు

17న అనకాపల్లి జోన్‌లో తాగునీటికి అంతరాయం

అనకాపల్లి టౌన్, జూలై 15 : జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో ఈ నెల 17వ తేదీ బుధవారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవి సోమవారం తెలిపారు. జీవీఎంసీ అమృత్ ప్రాజెక్టు 2.0లో భాగంగా తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు పీఎస్‌సీ పైపులైన్ స్థానంలో 500 ఎంఎం సామర్థ్యం కలిగిన డీఐ పైపులైన్‌లను వేయడం జరుగుతుందన్నారు. ఈ కారణంగా తుమ్మపాల హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్రస్తుతం ఉన్న పీఎస్‌సీ పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేసే అనకాపల్లి ప్రాంతమంతా బుధవారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలంతా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

తాడి గ్రామ తరలింపునకు తహసీల్దార్ స్థల పరిశీలన

▸ నిర్వాసితుల సమస్యలను వివరించిన కూటమి నాయకులు


లంకెలపాలెం, జూలై 15 : ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించి, పునరావాసం కల్పించేందుకు పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో గతంలో కేటాయించిన స్థలాన్ని సోమవారం పరవాడ తహసీల్దార్ గణపతిరావు పరిశీలించారు. పునరావాసానికి కావాల్సిన సుమారు 70 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. ప్రస్తుత స్థల స్థితిగతులపై నివేదకను తయారు చేసి ఆర్డీవోకు అందజేస్తామని వెల్లడించారు. ఇదిలావుంటే, తాడి గ్రామం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని జనసేన పార్టీ నేత పంచకర్ల ప్రసాద్ తహసీల్దార్‌ను కోరారు. ప్రస్తుతం సుమారు గ్రామంలో 1000 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని, అందుకు అనుగుణంగా భూమిను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరాము నాయుడు, సర్పంచ్‌లు బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు, కూటమి నాయకులు బుగిడి గోవిందరావు, కరణం నరసింగరావు, బొడ్డపల్లి అప్పారావు, పలువురు తాడి గ్రామస్థులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

'పేట' పార్కుపై ఎట్టకేలకు పంచాయతీ దృష్టి

▸ చెత్తాచెదారం తొలగింపు

పాయకరావుపేట, జూలై 15 : చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న పాయకరావుపేట పట్టణంలోని దాసరి గవర్రాజు స్మారక పార్కును పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. 'పచ్చని పార్కుపై- పంచాయతీ నిర్లక్ష్యం!' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై పంచాయతీ అధికారులు వెను వెంటనే స్పందించారు. పార్కు ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు ఆవరణలో బయటి వ్యక్తులు పెట్టిన తోపుడు బళ్లను తీయించారు. ఈ సందర్భంగా ఈవో పీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్కు నిర్వహణలో లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె.చంద్రశేఖర్, బీపీబీఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పార్కులో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనకాపల్లిలో భారీ వర్షం

అనకాపల్లి టౌన్, జూలై 15 : జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో సోమవారం భారీ వర్షం కురిసింది. 16.4 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వర్షం కురిసింది. ఈ కారణంగా పలు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు కొంతమేర నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు కొంత తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే ఈ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలకు ఎంతో దోహదపడుతుందని పలువురు చెబుతున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం పంపిణీ

పాయకరావుపేట, జూలై 15 : ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన భవన నిర్మాణ కార్మికుడు రొంగల శివ కుటుంబానికి సోమవారం రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. తుని, పాయకరావుపేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మృతుడు తల్లికి రూ.లక్ష, మృతుడి భార్యకు రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు తదితరుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కూండ్రపు చిన్నారావు, చంటి, పంపనబోయిన చంటి, మేకల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూరు, జూలై 15 : అనకాపల్లి భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్ డే వర్ ప్లేస్ అండ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. ముఖ్య అతిథులుగా హాజరైన డీడీఎం సమంత్‌కుమార్‌రెడ్డి, విశాఖపట్నం ఎస్‌బీఐ ఎల్‌డీఎం మాట్లాడుతూ యువత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

డైట్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొత్తూరు, జూలై 15 : అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మల్టీ నేషనల్ కంపెనీ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్ ముకేష్ జాస్మిన్, శ్రియాలు ఈ ప్రక్రియను చేపట్టారు. మొత్తం 152 మంది విద్యార్థులు హాజరుకాగా, 49 మందిని షార్ట్‌లిస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దుర్గాశ్యాం ప్రసాద్, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఈశ్వరరావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

▸ విచారణ చేపట్టాలి ▸ కొత్తూరు గ్రామ సభలో సర్పంచ్ డిమాండ్

కొత్తూరు, జూలై 15 : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు ఉపాధి హామీ పనుల్లో లక్షలాది రూపాయల అవకతవకలు జరిగాయని ఆ పంచాయతీ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, వార్డు సభ్యులు, కూలీలు ఆరోపించారు. తక్షణమే వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలు జరిగాయని పలు మార్లు ఏపీవో సుప్రియకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఉపాధి పనులకు జాబ్ కార్డులు ఉన్న వారు 600 మంది ఉన్నప్పటికీ పనులకు వచ్చే సంఖ్య స్వల్పం కావడంతో ఇదే అదునుగా భావించిన మేట్ నాగమణి చేతివాడం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపించారు. అయినప్పటికీ ఆమెను వెనకేసుకురావడం తగదన్నారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపించి సదరు డబ్బులను రికవరీ చేయాలని కోరారు. ఇకపై ఇటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీటీసీలు ఎం.సంతోషికుమారి, వెలుగుల లక్ష్మి, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మీప్రసన్న

మహా సేనాని అలంకరణలో
వారాహి అమ్మవారు

▸ దేవీపురంలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, జూలై 15 : మండలంలోని దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారు మహా సేనాని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. క్షీరాభిషేకం, శోడషోపచార పూజ, కుంకుమార్చనల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో గురుమాత అన్నపూర్ణమ్మ, శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథస్వామిని దర్శించుకున్న 'పీలా'


స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జూలై 15 : పట్టణంలోని గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామిని సోమవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకున్నారు. బుద్ధావతారంలో ఉన్న స్వామికి పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, కమిటీ సభ్యులు సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'అన్ని వార్డుల్లో జనసేన సభ్యత్వ నమోదు'

ఎలమంచిలి, జూలై 15 : మునిసిపాలిటీలోని ప్రతి వార్డులో జనసేన కార్యకర్తలంతా సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మునిసిపాలిటీలోని 25 వార్డులకు చెందిన జనసేన నేతలు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయకుమార్ గెలుపులో అందరి కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సభ్యత్వ నమోదుకు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, మోటూరు సంతోష్ కుమార్, గుర్రాల శేఖర్, సందిపర్తి చిట్టిబాబు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకంగా ఉపాధి హామీ పనులు'

పరవాడ, జూలై 15 : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి సూచించారు. ఇక్కడి వెలుగు కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో మాట్లాడారు. కూలీలకు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనిదినాలను కూలీలకు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కీర్తి స్పందన, ఉపాధి హామీ పథకం ఏపీవో గోవిందరావు, హౌసింగ్ ఏఈ ఎంఎస్ఎస్ఎన్ రెడ్డి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా వ్యర్థ జలాలు ట్యాంకర్లతో తరలించాలి

పరవాడ, జూలై 15 : మండల కేంద్రం పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని మల్లోడి గెడ్డలో నెలల తరబడి నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాలను ట్యాంకర్ల సహాయంతో రాంకీ సీఈటీపీ తరలించాలని భరిణికం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ పీవీ ముకుందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నెలల తరబడి ఫార్మా వ్యర్థ జలాలు గెడ్డల్లో నిల్వ ఉండడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. దీనివల్ల భరించలేని దుర్వాసన వెదజల్లడంతో పాటు కాలుష్యం తీవ్రస్థాయిలో పెరిగిపోయిందని వాపోయారు. ఈఈని కలిసిన వారిలో భరిణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వెంకట సత్యారావు పాల్గొన్నారు.

' మీ- సేవ కేంద్రాలకు పూర్వవైభవం'

ఎస్.రాయవరం, జూలై 15 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినందున రానున్న రోజుల్లో మీ- సేవ కేంద్రాలకు మంచిరోజులు రానున్నాయని మీ-సేవ కేంద్రాల నిర్వాహకుల యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు ముత్తా గోవిందరావు అన్నారు. సోమవారం మండలంలోని గోకులపాడులో ఏర్పాటైన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల వల్ల మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు రోడ్డున పడ్డారన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు కర్రి జోగారావు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఏఎన్ బాబు, భీమరశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కర్రి భూపతి రావు, సహాయ కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు.

కొత్తూరులో వైద్య సిబ్బంది ర్యాలీ

రాంబిల్లి, జూలై 15 : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఆర్.వెంకటేష్, డాక్టర్ బాల శ్రావణి అన్నారు. డయేరియా, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీలు చాందిని, కుమారి, రేష్మ, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్లు ముస్తాబు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్ అధికారులు రెండుచోట్ల భవనాల ఆధునికీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. రెండుచోట్ల పనులు చేస్తున్న వారికి ఈఈ చిరంజీవి పలు సూచనలు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గస్టు రెండో వారంలో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఈ నెలాఖరునాటికి ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ల భవనాల పనులను పూర్తి చేయనున్నట్టు ఈఈ చిరంజీవి చెప్పారు.

నర్సీపట్నం నియోజకవర్గం

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

▸▸ డిప్యూటీ డీఈవో అప్పారావు


పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న దృశ్యం

మాకవరపాలెం, జూలై 15 : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చునని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు.సోమవారం ఆయన మాకవరపాలెం హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈ కార్యక్రమంలో ఎఈవో-2 పీఎస్ఎన్ మూర్తి, హెచ్‌ఎం అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

'భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు'


భోజన పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో

నాతవరం, జూన్ 15 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా నిర్వాహకులు చూడాలని ఎంఈవో కామిరెడ్డి వరహాల బాబు ఆదేశించారు. చమ్మచింత హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఇక నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి తనిఖీలు ఉంటాయన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌ఎం కె.శివరామప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి వినతి

నర్సీపట్నం, జూలై 15 : జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రంథాలయ భవన నిర్మాణాలు చేపట్టాలని విశ్రాంత గ్రంథాలయ పాలకులు కె.త్రిమూర్తులు, మురళీ కృష్ణ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కోరారు. సోమవారం ఆయనను తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. విశాఖపట్నం మహారాణిపేటలో కోట్లు విలువ చేసే ఎకరా స్థలం ఉందని తెలిపారు. సదరుస్థలంలో గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఆర్డీవో ఆదేశం


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూలై 15 : ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అధికారులకు సూచించారు. ఇక్కడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి వద్ద నుంచి స్వయంగా అర్జీని స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీ ఏడో వార్డుకు చెందిన బొట్ట వరహాలమ్మ వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరింది. వెంకునాయుడుపేటకు చెందినమహిళ తన పెన్షన్ తీసేశారని వాపోయింది. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసినవారు సమస్యలను వివరించారు. ఇదిలావుంటే, పించన్లు, సదరం సర్టిఫికెట్ల కోసం ఎక్కువ మంది విజ్ఞాపనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్తయిన వారికి జాబ్‌మేళాలు నిర్వహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ


ప్రిన్సిపాల్‌కు వినతిని అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

నర్సీపట్నం, జూలై 15 : డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులకు జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నర్సీపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువులు సాగిస్తున్నారన్నారు. ఇక్కడ చదువు పూర్తయిన విద్యార్థులకు జాబ్‌మేళాలు నిర్వహిస్తే మరింత మంది కళాశాలలో చేరే అవకాశం ఉంటుందన్నారు.

బలిఘట్టం సత్యదేవుని ఆలయంలో రేపు వ్రతాలు



నర్సీపట్నం, జూలై 15 : పట్టణ పరిధిలోని బలిఘట్టం ఉత్తర వాహిని సమీపంలో కొలువుదీరిన రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారి వ్రతాలను నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు భద్రాచలరామం తెలిపారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు సౌకర్యార్థం ఉదయం ఆరు గంటలకు ఒక బ్యాచ్, 9.30 గంటలకు రెండో బ్యాచ్ ద్వారా వ్రతాలు జరిపిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

'సెబ్సా' రాష్ట్ర అధ్యక్షుడిగా శివనారాయణరాజు


శివనారాయణరాజు

నర్సీపట్నం, జూలై 15 : సామాక, ఆర్థిక వెనబడిన తరగతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సీపట్నానికి చెందిన కె.శివనారాయణరాజును నియమిస్తూ సెబ్సా జాతీయ సంఘం అధ్యక్షులు కె.రామకృష్ణ, హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షుడు కోనా మంగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ అనుబంధ సంస్థగా సెబ్సా ఉంది. ఈ సందర్భంగా శివనారాయణరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముందుగా జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వీడని స్మార్ట్ మీటర్ల బెడద

... 5వ పేజీ తరువాయి

పలు చోట్ల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. దీనిని రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల అమరిక పనులు జరుగుతుండడంపై ఏపీ ఈపీడీసీఎల్ జిల్లా అధికారి రాజశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా గతంలో కుదిరిన కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి స్మార్ట్ మీటర్ల పనులపై కొత్త మార్గదర్శకాలు వస్తే ఆ విధానాన్నే అమలు చేస్తామన్నారు. రైతులు వద్దని చెబితే బిగించవద్దని ఆదేశిస్తామన్నారు. కొత్త ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు న్యాయం చేస్తామన్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్లు ముస్తాబు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీరింగ్ అధికారులు రెండుచోట్ల భవనాల ఆధునికీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. రెండుచోట్ల పనులు చేస్తున్న వారికి ఈఈ చిరంజీవి పలు సూచనలు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గస్టు రెండో వారంలో అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఈ నెలాఖరునాటికి ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ల భవనాల పనులను పూర్తి చేయనున్నట్టు ఈఈ చిరంజీవి చెప్పారు.

ప్రమాద స్థాయికి కల్యాణపులోవ నీటిమట్టం

... 5వ పేజీ తరువాయి

కురుస్తాయని, ఈ ఏడాది రిజర్వాయర్ ఎగువ కొండల్లో ముందుగానే వర్షాలు కురుస్తున్నందున జలాశయంలోకి ఇన్‌ఫ్లో అధికంగా వచ్చి చేరుతుండడంతో ప్రమాద స్థాయికి చేరుకుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆయకట్టు రైతులకు నీటికి డోకా ఉండదని ఏఈ సత్యనారాయణదొర తెలిపారు.

గరిష్ఠ సాయికి పెద్దేరు..

మాడుగుల రూరల్: మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలకు జలాశయంలో వర్షం నీరు చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.50 మీటర్లకు చేరింది. సోమవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 188 క్యూసెక్కులు నమోదైంది. రాత్రి తొమ్మిది గంటల తరువాత స్పిల్‌వే ద్వారా 200 క్యూసెక్కుల విడిచిపెడతామని జలాశయం ఏఈ సుధాకర్ తెలిపారు.

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

బెంగ వద్దని, అందుకు అనుగుణమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీహెచ్ పట్ల ప్రజల్లో మంచి భావన ఉండేదని, అది క్రమంగా తగ్గుతోందని, దాన్ని మళ్లీ పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయని, మంచి నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఆస్పత్రి అవసరాలను చెప్పాలని, వాటిని తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పరిశోధనలు సాగించడం ద్వారా ప్రివెంటివ్ మెథడ్స్‌పై దృష్టిసారించాలని శ్రీభరత్ సూచించారు. కేజీహెచ్‌తో పాటు జిల్లా అంతటా ఫాగింగ్ చేయించడంపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, వందలాది మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నిరుపేద రోగులకు ఏర్పడుతోందన్నారు. కేజీహెచ్‌కు రావాలంటే ఇప్పటికీ రోగులు భయపడుతుంటారని, మెరుగైన సేవలు అందవన్న భయం రోగుల్లో ఉందన్నారు. నర్సింగ్ స్టాఫ్ కొరత ఎప్పటి నుంచో వేధిస్తోందని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి అవసరాలకు తగ్గ సిబ్బంది లేరన్నారు. ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలని, అవి తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు సహకారాన్ని అందించేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేయాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. రోగుల పట్లతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఇక్కడకు వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన ప్రజల్లో కలగాలన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీహెచ్‌లో సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషిచేయాలని సూచించారు. వైద్య వృత్తిలో డబ్బు సంపాదించాలన్న ఆలోచన సరికాదని, వ్యాపారులు మాత్రమే డబ్బు సంపాదిస్తారని, ఇందులో సేవాగుణం మాత్రమే ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం: మంత్రి సత్యకుమార్

వందేళ్ల చరిత్ర కలిగిన ఏఎంసీ నుంచి వేలాది మంది వైద్యులుగా బయటకు వెళ్లి దేశ,విదేశాల్లో స్థిరపడ్డారని వారంతా ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందించాలని మంత్రి సత్యకుమార్ కోరారు. దాతల సహకారంతో విభాగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూసే రోజులు పోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు వైపు వచ్చేలా చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలపై దృష్టిసారించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఆస్పత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు మ్యాచింగ్ గ్రాంటుకు నిధులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సత్కరించారు. పలువురు సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ నాయకులు పీలా గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ బాస్కరరావు, డాక్టర్ లోకనాథం, డాక్టర్ గోపి, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం

మొక్కలతో భూమాతకు రక్ష

బుచ్చెయ్యపేట, జూలై 15: అమ్మ పేరుతో మొక్కలు నాటడం భూ మాతకు రక్ష అని తురకలపూడి అటవీ శాఖ ఏబీవో వి.అర్జున అన్నారు. దిబ్బిడి జడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలోని జీవరాశుల మనుగడకు మొక్కలు కీలకమన్నారు. చెట్లను నరకడంతో వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సమాజంలో అందరికీ అమ్మ అంటే గౌవరమని, అమ్మ పేరుతో నాటిన మొక్కను అంతే గౌవరంగా పెంచితే అది వృక్షమై కొన్ని తరాలకు నీడ, గాలిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.జె.రవీంద్రబాబు, వన సేవకులు ముత్యాలు, నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న వడ్డాది మరిడిమాంబ పండగ



బుచ్చెయ్యపేట, జూలై 15: వడ్డాదిలో ఈ నెల 18న మరిడిమాంబ పండగను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అమిరిపిల్లి సత్తిబాబు తెలిపారు. ప్రతీ ఏడాది ఆషాఢ మాసంలో నిర్వహించే పండగకు ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

బస్సు సదుపాయం కల్పించాలి

రోలుగుంట, జూలై 15: మండలంలోని జె.నాయుడుపాలెం, బలిజిపాలెం, గుండుబాడు, కశిరెడ్డిపాలెం, కన్నంపేట గ్రామాల మీదుగా బస్సు సర్వీసు నడపాలని సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, కె.గోవిందరావు డిమాండ్ చేశారు. కసిరెడ్డిపాలెం నుంచి కన్నంపేట వరకు గ్రామాల్లో కొత్తకోట, నర్సీపట్నం, రోలుగుంటలో ఉన్న కళాశాలలు, హైస్కూల్‌లలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారని, బస్సు లేక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వెళ్లి రావాల్సి వస్తున్నదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరారు.

చోడవరంలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి

▸▸ పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు: ఎమ్మెల్యే రాజు


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

చోడవరం, జూలై 15: నియోజకవర్గ కేంద్రం చోడవరంలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా సోమవారం నిర్వహించిన చోడవరం మేజర్ పంచాయతీ పాలకవర్గం సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రైతుబజారు. రహదారులు, కాలువలు చాలా వరకు అసంపూర్తిగా ఉండిపోయాయని, వాటికి నిధులు తెచ్చి పూర్తిచేసే బాధ్యత తనదేనని చెప్పారు. పంచాయతీకి వచ్చే నిధులు ఇతర పనులకు వెచ్చించకుండా పూర్తిగా విద్యుత్, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికే కేటాయించాలన్నారు. ప్రధాన పనులకు సంబంధించి తాను ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకుని వస్తానన్నారు. వార్డుల వారీగా సభ్యులు పార్టీలకతీతంగా సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. పారిశుధ్య సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఈవో నారాయణరావు, పంచాయతీ సర్పంచ్ బండి నూకరత్నం, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, వార్డు సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం... రైతుల హర్షం


చోడవరంలో కురుస్తున్న వాన

చోడవరం, జూలై 15: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జూలై నెల వచ్చినప్పటికీ వర్షాలు కురవక వేసవి వాతావరణం కొనసాగుతున్న పరిస్థితుల్లో, సోమవారం ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మబ్బుపట్టివర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. వడ్డాది, బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, మంగళాపురం కూడళ్లు వర్షం నీటి ముంపునకు గురయ్యాయి. ఈ వర్షంతో ఖరీఫ్ సీజన్ పనులు ఊపందుకోనున్నాయి.

చీడికాడలో...

చీడికాడ: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో ఇప్పటికే ఎండిపోతున్న వరి ఆకుమడులకు ఊపిరిపోసినట్టు అవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


బీఎన్ రోడ్డులోని గోతుల్లో చేరిన వర్షం నీరు

మాడుగులలో...

మాడుగుల రూరల్: మండలంలో మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బు వాతావరణం నెలకొంది. సాయంత్రం నాలుగు గంటలకు తేలికపాటి జల్లులతో ఆరంభమై సుమారు గంటసేపు మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం వరిఆకుమడులకు, చెరకు మొక్కతోటలకు ఉపయోగకరమని రైతులు తెలిపారు.

రక్తదానం సామాజిక బాధ్యత

▸▸ వందే భారత్ బ్లడ్ బ్యాంకు చైర్మన్ వినోద్‌బాలు

బుచ్చెయ్యపేట, జూలై 15: రక్తదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాలు అన్నారు. వడ్డాదిలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రతీ వ్యక్తి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. రక్త నిల్వల కొరత తీరాలంటే అందరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ సదస్సులో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, నాయకులు దొండా నారాయణమూర్తి, ఎస్.నవీన్, అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, వేణు చౌదరీ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బాసట అభినందనీయం

రావికమతం, జూలై 15: దివ్యాంగ విద్యార్థులకు మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు బాసటగా నిలవడం అభినందనీయమని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల అన్నారు. మండలంలోని 60 మంది దివ్యాంగ విద్యార్థులకు హాట్‌బాక్సులు, తాగునీటి సీసాలు, రగ్గులు, బోధనోపకరణాలు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మినాయుడును స్ఫూర్తిగా తీసుకుని అందరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథనాయుడు, సరోజిని, ఫిజియోథెరపిస్టు లావణ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

దేవరాపల్లి, జూలై 15: గ్రామాల్లో పారిశుద్యం మెరుగు పడినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ బూరే.బాబూరావు పాలక వర్గ సభ్యులతో పారిశుద్యం మెరుగు పర్చే విధంగా ప్రత్యేక శ్రద్ధతో వీధుల్లో చెత్త తొలగించే పనులు సోమవారం చేపట్టారు. ఈసీజన్‌లో వ్యాధులు ప్రభల కుండా ప్రతిరోజు ప్రణాళిక ప్రకారం పారిశుద్య పనులు చేసే విధంగా తీర్మాణం చేసారు. కార్యదర్శి జామి అప్పారావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పూర్తిచేయాలని ఆందోళన


అసంపూర్తి భవనం వద్ద ఆదివాసీల నిరసన

రావికమతం, జూలై 15: టి.అర్జాపురం పంచాయతీ శివారు డోలవానిపాలెంలో అసంపూర్తిగా వదిలేసిన అంగన్‌వాడీ భవనం పూర్తిచేయాలని సోమవారం ఆదివాసీలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ డోలవానిపాలెం, రామన్నదొరపాలెం గ్రామాలకు కలిసి ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 20 మందికి పైగా పిల్లలు ఉన్నారన్నారు. ఈ కేంద్రానికి పదేళ్ల క్రితం మంజూరైన భవనాన్ని ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారన్నారు. దీంతో ఇబ్బందుల నడుమ అద్దె ఇంటిలో కేంద్రం నడపాల్సి వస్తున్నదని వాపోయారు. ఇప్పటికైనా ఈ భవనంపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్.వలసయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం ఉపాధి కూలీల ధర్నా


సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

దేవరాపల్లి, జూలై 15: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కూలీలు ధర్నా చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చింతలపూడి సచివాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నేత బీటీ దొర మాట్లాడుతూ నాలుగు వారాలుగా పనులు చేస్తున్నా వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో చింతలపూడి పంచాయతీ కోరాడ, కొత్తూరు, వీరబద్రపేట గ్రామాల్లోని కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.

మాడుగుల నియోజకవర్గం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాడుగుల రూరల్, జూలై 15: మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తాయి. సాయంత్రం వర్షం పడిన తర్వాత సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది. కరెంట్ ఇవ్వడం, కట్ చేయడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు వర్షం పడినా ఇలాంటి సమస్యలే ఎదురవుతుండడంతో ఇళ్లలోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు, విద్యుత్ ఆధారిత పరికరాలు పాడవుతున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించి సమస్యలు లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

భూముల వేలం పాటపై దేవదాయ శాఖ అధికారుల నిలదీత

చీడికాడ, జూలై 15: మండల కేంద్రంలో రామాలయానికి చెందిన సర్వే నంబరు 383, 384లో 12.78 ఎకరాలను సోమవారం వేలం వేయడానికి సమాయత్తమైన దేవదాయ శాఖ అధికారులను సర్పంచ్ కుమారుడు గాలి బాలకృష్ణ నిలదీశారు. మూడేళ్ల క్రితం పెట్టిన పాటలో వచ్చిన నగదు సంబంధించి రామాలయం తాలూకా దూపదీప నైవేద్యాలకు, ఊరేగింపునకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిపై దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఏదైనా దేవాలయానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి ద్వారా నివేదిక తీసుకుని అప్పగిస్తామని చెప్పారు. అనంతరం మూడేళ్ల క్రితం పాట పాడేందుకు డిపాజిట్ చేసిన నడుపూరి ముత్యాలు అనే రైతుకు రూ.20 వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రతతోనే వ్యాధులు దూరం


తనిఖీలు చేస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్‌దేవ్

చీడికాడ, జూలై 15: గ్రామాల్లో పరిశుభ్రతతోనే ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్ చెప్పారు. చీడికాడ పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రోగుల గదులు, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అంటు వ్యాధులు లేకుండా చూడాల వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మలేరియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులకు 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సునీల్‌కుమార్, శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, జిల్లా స్టాటికల్ అధికారి ఎస్.రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అవసరం

చీడికాడ, జూలై 15: పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు అవసరమని జైతవరం సర్పంచ్ కె.సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు చెప్పారు. జైతవరం గ్రామంలో సోమవారం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. వర్షాకాలంలో పశువులకు చర్మంపై పొక్కుల రూపంలో వస్తాయని, అటువంటి వ్యాధులు రాకుండా టీకాలు ఎంతో ఉపయోగమని పశు వైద్య సిబ్బంది ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, వీఆర్వో కోడూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.